# తాత్విక సంగీతం

స్నేహితుడి పెళ్లి కోసం కృష్ణ బెంగుళూరు వెళ్లినప్పుడు, అక్కడ వసుమతి అకస్మాత్తుగా ఎక్కడన్నా కనిపిస్తే బావుండును... ఎన్నాళ్లయిందో కదా ఆమెని చూసి... అనుకున్నాడు. ఆమె ఇప్పుడు బెంగుళూరులోనే ఉందని తెలుసు. పెళ్లి, పిల్లలు, సంసారం.

వసుమతిని చూట్టం అంటే ఇప్పటికీ కృష్ణకి ఒక మహాభాగ్యం అన్పిస్తుంది.

స్నేహితుడి పెళ్లిపేరుతో వెళ్లినా కృష్ణ అక్కడ తన ఆర్ట్‌ఎగ్జిబిషన్ ఏర్పాట్లు చేసుకుని వచ్చాడు. వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో.

దాదాపు పదేళ్ల విరామం తర్వాత ఇప్పుడు మళ్లీ కేన్వాస్‌ల ముందుకి వచ్చాడు. రంగులూ, కుంచెలూ - మళ్లీ తన పాత ప్రపంచంలో అడుగుపెట్టాడు. ఇప్పుడు చిత్రకళ అతడికి జీవితం అయింది. పెళ్లీ పిల్లలు సంసారం లేని అతడి జీవితంలో చిత్రకళ అతడి సర్వస్వం అయింది. తపోదీక్ష అయింది. అదే ఇప్పుడు అతడికి సంతోషాన్నిస్తున్నది.

దేశంలోనే కొద్దిమంది గొప్ప చిత్రకారుల్లో ఒకడిగా గుర్తింపు పొందాలని.

వసుమతికి తెలుస్తుందికదా ఈ అజ్ఞాత ప్రియుడు కృష్ణ తనకు కాలేజీలో సహవిద్యార్థేనని! ఆమె తెలుసుకోవాలి. ఏమో కోరివచ్చి ఆమె తనని కలుసుకొని పాతరోజులు గుర్తు చేసుకోవచ్చుకదా!

ఇప్పుడు తను చేస్తున్న ఉద్యోగం అల్పంగా, తోచి, త్వరలోనే దాన్ని

విడిచిపెట్టేయాలని అనుకుంటాడు. కాని అడవుల్లో జీవించటం అందరికీ దొరుకుతుందా?

పదేళ్లక్రిందటి తన చిత్రాలకీ ఇప్పటి చిత్రాలకీ మధ్య పోలికలే లేవు. అయితే ఆ చిత్రాల్లో తన తొలి యవ్వన శృంగార ప్రపంచం, జీవితంలో ఇప్పటికీ సత్యమే అన్పిస్తుంది. ఒక అమాయకత్వం, ఒక ఆరాధన, ఒక స్వప్నం — వర్ణ వైభవంతో చిత్రాలు చిత్రాలుగా అవతరించాయి. వాటిలో ఒక సహజ సౌందర్యం వెల్లివిరిసింది. వాటిల్లో ఒక మధురానుభూతి—

ఇప్పటికీ నిత్యనూతనంగా ఉంది.

కాని జీవితమే అంతాచివికిపోయినట్టు చితికిపోయినట్టు, రంగులన్నీ అలుక్కుపోయినట్టు — అర్థరహితంగా ఉంటున్నది. అంతా అబద్ధంగా ఉంటున్నది. అల్పంగా ఉంటున్నది.

రంగులూ, తన చిత్రాలే సత్యం, తన కళా ప్రపంచమే శాశ్వతం ఇప్పుడు.

జీవితం ఒక ఓటమి నించి మరొక ఓటమి దిశగా నడుస్తూ ఉంది. వైకుంఠపాళిలో అన్నీ పాములే తప్ప నిచ్చెన్లు లేనేలేవు.

ఈ నలభైయ్యేళ్ల వయస్సులో ఏదిముందో, ఏది వెనకో అర్థంకాదు.

తన ప్రయాణాలన్నీ ఎడారుల్లోకే దారి చూపుతున్నాయి.

ఎడారులంటేనే భయం. కాని అక్కడ ఒయాసిస్సులు ఎదురవుతున్నాయి.

అట్లాంటి ఒయాసిస్సే తన చిత్రకళ. తన ప్రేమాన్వేషణ — పరుగు తర్వాత కాళ్లకు సంకెళ్లు పడ్డట్టు ఉంటుంది.

అవును. వసుమతి ఆరాధనే తన భవిష్యత్తు... అదే తన కళాప్రపంచం.

జీవితంలో ఎప్పుడన్నా ఆమె ఎదురయితే... ఈ అజ్ఞాత ప్రేమికుణ్ని చూస్తే—

'నిన్ను ఆరాధించాను' అని ఇప్పుడన్నా చెప్పకోగలడా... ఈ కృష్ణ!

ఆమెనా లేక ఆమె నృత్యాన్నా తను ప్రేమించింది? లేక అంతా యవ్వన ప్రేమలీలేనా?

తనవంటి అజ్ఞాతప్రేమికులు ఎందరో ఆమెకు... తొలియవ్వన ఉద్రేకాలు... తమ ఇంగ్లీషు లెక్చరర్ గ్రహించింది. నవ్వుతూ చూసేది. తను అంటే మేడమ్‌కి ఇష్టం. ఇంగ్లీషులో ఎక్కువ మార్కులు వచ్చేవి. నాన్నగారంటే ఆమెకి గౌరవం. అడ్వొకేట్. తమ కుటుంబం గురించి తెలుసామెకి. గౌరవ కుటుంబం అని! అమ్మ గురించి తెలుసామెకి. ఎక్కడో బంధుత్వం!

తనకు చొరవలేదు.

వివాహం కన్నా ఉన్నతమేమో ఈ ప్రణయం! అమలిన శృంగారం అంటారా ఈ ఆరాధనని?

ప్రపంచంలో నీకు నచ్చిన అమ్మాయిలే లేర్రా అని కోప్పడ్డది అక్క. అక్కకి తెలీదు. అక్కతోకూడా చెప్పుకోలేకపోయినాడు...

రైలు పరుగెడుతూ ఉంది. నల్లమలై అడవిని మీటర్‌గేజ్ చీల్చేస్తూ పోతున్నది. కొండలమీద ఆఘమేఘాలు. చల్లని గాలి. మబ్బు వాతావరణం. దూరాన పడమటి కొండల్లో మెరిసే ఎండ. రివ్వుమని గాలి తప్పుకుంటున్నది.

కంపార్టుమెంట్ తలుపుతీసి నుంచుని, సృష్టిసౌందర్యాన్ని చూస్తున్నాడు కృష్ణ. ఒక్కోసారి అన్ని అపురూపమైన అందాలుకూడా వ్యర్థమైపోతున్నాయి. అతని మనసు అనుభవాలమీద, కోర్కెల మీద, జ్ఞాపకాల మీద సృష్టిసౌందర్యం గంతులు వేస్తున్నది. అంతా స్నేహితులు, బంధువులు, ప్రియులు బలవంతంగా కళ్లెదుట కదులుతున్నారు.

వసుమతి!

ఈసారి అతని మనసు... ఉదయసూర్యుని చూసిన మందారం చుట్టూ తిరిగే తుమ్మెదలా అయింది. మదతపడ్డ మందారం రేకులాంటి ఆ పెదవులు ఓమర్ ఖయ్యాం కవితా సోయగాలని పాడుతున్నట్టున్నాయి. ప్రియులహృదయాలకు స్వాగతమిచ్చే జ్వాలల నిత్యనిగారింపు నృత్య విన్యాసవిలాసంతో —— ఆ కళ్లు. పద్మాల తారళ్యం ఆ చెక్కిళ్లలో. కృష్ణమనసు గంతులేసింది. కాలేజీ రోజుల్లో మునిగింది.

కాలేజీలో —— సాంస్కృతిక వేడుకల్లో వసుమతి కూచిపూడి దశావతార నృత్యం! ప్రేక్షకులు రంగస్థలం మీద రంగులనృత్యవిన్యాసాలతో తన్మయులయి పోయారు. పైన నక్షత్రాలు, కృష్ణావతారం —— గోపికల్లో కృష్ణుడు. ఆ రంగస్థలం మీద కూర్చునేందుకు మృదంగ వాద్యమన్నా తనకు వచ్చింది కాదే! అదీ అతడి బాధ!

మరో గంతువేసింది మనసు.

పరుగులు పెడుతున్న ప్రకృతి దృశ్యాలు చూస్తున్నాడు కృష్ణ .

వెలుతురుని చీల్చుకుంటూ రైలు పరుగులు తీస్తూ పోతున్నది.

కాలేజీ డిబేటింగ్. ఉపన్యాసాలు. విద్యార్థుల గోల. ఎదురు బెంచీమీద వసుమతి. మనస్సును మత్తెక్కించే సౌరభం. డాల్ఫిన్ పర్వతాలమీద నల్లని మేఘాల్లో కత్తులయుద్ధం. బంగాళాఖాతం నిత్యస్తోత్రం ప్రకృతిగానంతో హృదయాల స్పందన.

ఆమె కదిలింది అక్కడినుంచి. అతను కదిలాడు. ఇద్దరూ ఒకే బాటలో. ఆమెని కలవాలని. ఆమె ముందు. అతను వెనుక. ఆమెతో మనసు చెప్పుకోవాలని ఒకరు. ఈ గడుగ్గాయినించి తప్పుకోవాలని మరొకరు.

నడక, ఆమె వేగం హెచ్చుతూ ఉంది. అతని సాహసం అనుకరిస్తూ ఉంది. చీకట్లో మధ్య మధ్య మెరుపులు.

ఆమె చూపులు పక్కకి తిరగటం లేదు. అతని పెదవులు కదలటం లేదు.

ఘర్జన —— గుండెల్లో!

గాలి. ధూళి వాళ్లమీంచి సుళ్లు తిరిగి పోతూ ఉంది.

వర్షం.

జన సంచారం. మనుషుల రొద.

అతని వేగం జంకింది. సాహసం వెనకడుగు వేసింది. వీగిపోయింది. పరాభవం.

రెండో దినం తెల్లారే నిద్రలేస్తూనే అనుకున్నాడు. అడ్డగించి ఆమెతో మాట్లాడక పోవటమే మంచిదయింది. అనుకున్నట్టే జరిగితే, తన పాలిట యమునిలా ఆమె అతడిని భావిస్తే, తన తపనంతా వ్యర్థమయ్యేదే! ఇదీ ఒకందుకు మంచిదే. అందుకు అతనిలో సంతృప్తి. ఒక యవ్వనంలోని కళకళలాడే నృత్యకళకోసం తను. ఆమె పెదవుల నవ్వుకోసం దాసోహం కాకూడదు. ఈ విధంగా కోరి పరిచయం చేసుకోవటం తనకే తలవంపు. ఆమె కళ వయస్సుకే పరిమితం. క్షణికం! అతని కళ యుగాలు నిలుస్తుంది. శాశ్వతం!

అతను వేసిన రంగుల చిత్రాల కేన్వాస్‌లు కనిపించాయి. ఊర్వశీ పురూరవులు, నండూరి ఎంకినాయుడు బావలు. బుచ్చిబాబు అమృతం దయానిధులు. కాళిదాసు శకుంతల దుష్యంతులు. అవన్నీ ఒక్కొక్కొటి ప్రక్కకు తప్పుకున్నాయి. తొలినాటి తన చిత్రాలు అవి.

ఘీంకరిస్తూ రైలు పరుగు పెడుతూ ఉంది. చెట్లూ, పుట్టలూ, కాలవలూ వెనక్కి జారిపోతున్నాయి.

"జీవితం" అని వేసిన తైలవర్ణ చిత్రం క్షణం మనస్సుని తన వశం చేసుకుంది. సంగీత స్రవంతిలా సెలయేరు. వసంతంతో మత్తెక్కిన పూల తోట. పదునెక్కిన బుల్బులి పిట్టల యవ్వనపరవశగానం. సూర్యాస్తమయానికి పురివిప్పిన మయూరనృత్యం. కొమ్మ మీంచి ఖయ్యాం కళ్లల్లోకి చూస్తున్న జవరాలిచేతిలోని

చిరుచేదు పానకం. మారిపోయే రుతువులను అలక్ష్యం చేసే తన్మయత్వం. ఆ రంగులు సృష్టించిన జీవితం కొన్నాళ్లు అతన్ని మైమరపించింది. అది కూడా ఇప్పుడు రుచించలేదు.

ఆఖరి రంగుల చిత్రం "తాత్విక సంగీతం." త్రైవార్షిక ప్రపంచ చిత్రకళా ప్రదర్శనలో నేషనల్ గేలరీ న్యూఢిల్లీ వాళ్లు ఎంపిక చేసుకున్నారు ఆ పెయింటింగ్‌ని. ఆ మ్యూజియమ్‌కి ఇవ్వాలని అనుకున్నాడు. అదే అతని ఆఖరిచిత్రం. రెండు సంవత్సరాలయింది. రంగులు, బ్రష్‌లూ ముట్టుకోలేదు. ముట్టుకోదలచలేదు కృష్ణ. ఆ చిత్రం ఇష్టం. అతని కోరిక తీరింది. ఆ రంగుల సమ్మేళన ఫలించింది. ఒక ప్రామాణత కొత్త మలుపు తిరిగి సిద్ధించింది. ఆ చిత్రంతో అతని చిత్రలేఖనా జీవితం కొత్త మలుపు తిరిగింది. లేత నీలం కాంతి అనంతంలోకి ప్రాకి మాయమయింది. శూన్యంలో విన్న సంగీత మాధుర్యం రక్తిమ వలయాలు తిరిగింది. అంతా క్షితిజం విశ్వవ్యాప్తమైన ఆ నీలంకాంతి. అది అరుణారుణం. జీవపరిణామ వికాసాలు ఆ పద్దెనిమిది చదరపుటడుగుల కాన్వాస్‌లో కలిసిన ఆ వర్ణహేల కళాప్రియులకు "తాత్విక సంగీతం" వినిపిస్తుంది.

రైలు మధ్యలో ఆగింది. అక్కడ స్టేషన్ ఏదీలేదు. గార్డ్ దిగి ఓ థర్డ్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో దూరాడు.

జ్ఞాపకాల గొలుసు ఎవరో లాగారు. కృష్ణ అందులో లీనమయ్యాడు.

మనస్సు సముద్ర తరంగాల లాలిత్యంలో దాగి నిర్మించుకొన్న స్వప్న సౌధాల్లోకి తొంగిచూసింది.

వసుమతి నృత్యం చేస్తున్నది.

ద్వారానికి ఆనుకుని చూస్తున్నాడు కృష్ణ. కిటికీలోంచి అస్తమయ కిరణాలు మోసుకొచ్చిన తుషారాల్లో తడిసి ఆమె ఒక నూతన తేజస్సుతో ఉంది.

"అలా ఉండు ఆ భంగిమరంగుల్లో చూపిస్తా"

అంగీకరించదామె.

"పిచ్చి వసుమతీ! చిత్రలేఖనం సరదా అనుకున్నావా? కుంచెరంగుల్లో ఈ సౌందర్యం కలిసి భవిష్యత్ తరాల సౌందర్యోపాసకుల హృదయాలను తన్మయత్వం కల్గిస్తుంది. మోనాలీసా లాగా. స్కెచ్ గీసుకొనీ" అంటాడు. ఆమె తన గుండెమీద పడిపోతుంది. అతడామెని సానునయ సానుకంపాలతో నిమిరి ఓదారుస్తాడు.

మల్లెలు చంద్రుని వెన్నెల్లో దాగిపోతాయి. పరిమళ పరివేష్టితమవుతుంది

అనుభవం. అవన్నీ యౌవన స్వప్న సౌధాలు!

రైలు కదిలింది.

పక్క కంపార్టుమెంట్ కిటికీలోంచి ఓ మృదువైన స్త్రీ హస్తం. ఇంకో జత లేత చిన్నారి చేతులు. ఆ చేతిలో నృత్యభంగిమలోని హస్త విన్యాసం సుమతిని మళ్లీ జ్ఞాపకం తెచ్చాయి. ఎవరామె? ఎక్కడికి? బెంగుళూరు నించా? విశాఖేనా? వసుమతేనా? ఆ చేతులు...

అతని కళ్లముందు కదులుతున్న టెలిగ్రాం! అమ్మ పెళ్లి చేసుకోమంటుంది. బతిమాలి ఏడుస్తుంది. ఇష్టం లేదంటాడు. పాతపాటే. అమ్మకి యే జ్వరమూ లేదు. ఇదే లోగుట్టు. అమ్మని చూస్తే జాలి. తెలీని ఎవరితోనో వివాహం. అట్లా జీవితం గడపటం. ఎంతకీ మనసు ఇష్టపడదు.

వెధవ బ్రతుకు. ఎందరో పోయారు. భవిష్యత్తులో ఈ కృష్ణ అని పిలవబడే వ్యక్తికూడ అదే స్థానంలో, అనంతశాంతిలో విశ్రాంతి తీసుకుంటాడు. అతని కళ ఎవరు చూస్తారు? ఎవరు ఆనందిస్తారు? ఎవరు బాధపడతారు? అయ్యయ్యో! ఒక స్త్రీ కోసం ఎంత బాధపడ్డాడూ అని అతనిని ఓ వాంగోనో, గాగిన్‌గానో ఊహించుకొని బాధపడతారు. ఆ సానుభూతి మాత్రం ఈ ఆత్మకి మిగుల్తుంది అలా పోతాయి ఆలోచనలు.

అందుకే ----

జీవితం యాంత్రికం చేసుకున్నాడు.

ఫారెస్టు ఆఫీసర్ ---- సాయంకాలాలు వేట. జీవుల ప్రాణాలతో చెలగాటం. జీవన మరణాల ఆధ్యంతాలలో అంతర్నిబిడమైన సయ్యాటలలో పాత్రధారి. లంబాడీలు. నృత్యాలు. చూపులు. మర్యాదలు. నదిలో ఈత. గుర్రపు స్వారీ. రాత్రి నిషా. యంత్రంలా మార్చుకున్న జీవితానికి అలవాటుపడ్డాడు.

ప్రక్క కంపార్టుమెంటులోని హస్తం కదిలింది మరోసారి. ప్రకృతి అందాలతో పులకించిన్నట్టుంది.

రైలు ఆగింది. కదిలింది. అతనికి తెలుసు. తెలియదు.

పదేళ్ల క్రితంకీ, ఇప్పటికీ చాలా మార్పు ఉంది. ఈ సంఘం మీద ఆశ ఉంది. మనుషులపైన నమ్మకం ఉంది. ఆదర్శాల సాధనలో ధైర్యం ఉంది. సంగీతంతో అతని హృదయం పరవశం పొందేది. చిత్ర కళలో లీనమై రాత్రులు పగలు విస్మరించేవాడు. లోకం అందంగా ఉండేది. మనుషులు ప్రేమమూర్తులుగా కన్పించేవారు. కాని

ఇప్పుడు అంతా విరుద్ధం.

ఆచారాలు, కులాలూ, ధర్మాలూ, హెచ్చుతగ్గులు, స్త్రీ పురుష బాంధవ్యాలు, ఈర్ష్యాసూయలు కలసి యీ సంఘం అనే సరోవరం దుర్గంధ పంకమయమయింది. దాంట్లో ఎన్నో జీవితాలు మునిగిపోయాయి. అలాగే తను కూడా. ఈ నీతి బోధకులనీ సనాతనులనీ తిట్టాడు.

తనలో తను బాధపడ్డాడు కొన్నాళ్లు. వసుమతితో చొరవతీసుకుని మాట్లాడవలసింది. ఎందుకు తన మనసు చెప్పుకోలేక పోయానా అని. విషయాలన్నీ సావకాశంగా మాట్లాడి, జీవితాల పరిణామాలు ఆనాడే తేల్చుకొని ఉంటే బావుండేదే అని ఇప్పుడు. కాని, మించిపోయింది కదా.

జీవితం దూరపుకొండలు. అందాల కొండలు పూర్వం.

సమీపించాకా ఇప్పుడు అంతా వికృతం.

కృష్ణ హాయిగా జీవితం గడుపుకుంటున్నాడు అంటారు మిత్రులు. వారికి తన జీవితం దూరపుకొండలు. సుమతిని అలాగే తనూ ఊహించు కుంటున్నాడా?

సొరంగం నుంచి పోతున్నది రైలు. ధ్వని ప్రతిధ్వనిస్తూ ఉంది. విద్యుద్దీపాల వెలుగుల సొరంగం.

కృష్ణకి తారతమ్యాలు అర్థమయ్యాయి. ఈ రైలు పోవటానికి సమతలం అవసరం. కొండలు ఎక్కలేదు. లోయల్లోకి దిగలేదు. పట్టాల దారి ఉండాలి. నది దగ్గర వంతెన అవసరం. కొండల్లో సొరంగం అవసరం. ఈ రైలు నడవాలంటే ఈ మార్గంలో ఈ రెండూ అవసరం.

కాని, కూలబోయే వంతెనమీద పోయే రైలులాంటిది తన జీవితం. ఎక్కడా సర్దుబాటులేదు. ఆ కొండ ఎక్కాల్సిందే. ఈ లోయల్లోకి దిగాల్సిందే. ఆదర్శాల సాఫల్యత కోసం జీవితాన్ని ప్రయోగాలకు వినియోగించుకున్నాడు. బహుశా తన నమ్మకం చాలా మందికి మూర్ఖత్వం అనిపించిందేమో!

వసుమతి చక్కని బాట వేసుకుంది. ఈ కొండలూ, ఈ నదీ లోయలూ, ఆమె పాలిట ఆమె విహారస్థలాలయి, ఆమెకి నిచ్చెనలయ్యాయి. ఆమె లోకాన్ని లక్ష్యపెట్టలేదు. కొన్నాళ్లు విద్య. మంత్రులకూ, రాజకీయ నాయకులకూ చోటు లభ్యమయే రంగస్థలనృత్యప్రదర్శనలు. అప్పుడప్పుడు పేపర్లలో చదివాడు. పత్రికలు ముఖచిత్రాలు వేసుకుని పరిచయం చేశాయి. ప్రముఖ విజ్ఞానశాస్త్ర పరిశోధకుని జీవిత భాగస్వామిగా స్వీకరించిందని ఓ రోజు దినపత్రికలు హర్షించి శుభాకాంక్షలు

చెప్పుకున్నాయి. బహుశా ఈ నాటికి ఒకరిద్దరు బిడ్డలు! ఆమె ఇప్పుడు తల్లి!! ఆమెకు నాయకులఆహ్వానాలూ, విదేశీయాత్రలూ, టెలివిజన్ ప్రోగ్రాంలూ, సన్మానాలూ, పూలహారాలూ...

కృష్ణ ఆలోచన తెగింది.

స్వప్నాలు దుస్వప్నాలు మామూలే.

వంతెనమీద రైలు. కొండకీ కొండకీ మధ్య ఫర్లాంగుపొడవు వంతెన. రైలు ఆ వంతెనమధ్య కొచ్చేటప్పటికి వందల అడుగుల లోతులో నది —— ఆ నీళ్లలో కన్పిస్తున్న రైలునీడ. అగాధంలోకి కృంగిపోతున్నట్టు. శూన్యం ఆవరించు కుంటున్నట్టు.

వేళ తెలీదు. మబ్బువేసిందో, సూర్యుడే ఉదయించలేదో, చీకటో, వెన్నెలో తెలీదు. అదోరకమయిన చీకటీ—— వెలుతురూ! నీటిలోని చేపకి అనుభవమయ్యే వాతావరణం. దూరాన గోలలు... రోదనలు... కేకలు —— అస్పష్టంగా ఆవల ఒడ్డున జనం.

ఓ రాయికి అంటుకొన్నట్లుగా ఓ వ్యక్తి చీరని ప్రవాహంపట్టి లాగుతూ ఉంది. ప్రవాహం క్రమ క్రమంగా హెచ్చుతూ ఉంది.

చిన్నస్మృతి. జీవిలోని అల్పమైన ఇంద్రియ శక్తికి నిరూపణగా స్మృతి. ఎవరు?

కృష్ణ గాయాలని ప్రవాహం కడిగేసింది. కుడిచెయ్యి శక్తి కోల్పోయింది. అతని గుండెలోని గాలి పాదం క్రింది రాయిని ఆన్చి బలంగా ముందుకి, ఒడ్డుకి, ఆ రాయి దగ్గరకి, ప్రక్కనే ఉన్న ఆ శరీరం వేపు కదిలింది.

అదే శరీరం! ఎన్నో నృత్యాలు చేసింది. ఎందరి మనుసులనో పాలించింది. అదే శరీరం!! కళ్లు మూసుకొన్నాడు కృష్ణ. చీరను లాక్కుపోయింది ప్రవాహం. జాకెట్టూ, లంగా —— నిండు చూలాలు. వసుమతేనా? అవునా? కాదేమో.

ఇంకా బలంగా అతను ఒడ్డుకు చేరుకునే ప్రయత్నం చేశాడు. ఇంకో పెద్ద ప్రవాహం మానవశక్తిని జయించింది.

* * *

కృష్ణ చిత్రాలు నేషనల్ గేలరీ ఆఫ్ మోడర్న్ ఆర్టు, న్యూఢిల్లీ తీసుకుంటుంది.

ఒక నిరుద్యోగి జీవిత సమస్య తీరిపోతుంది.

లంబాడీలు కృష్ణని జ్ఞప్తికి తెచ్చుకుని, కథ విని, బాధపడి, అశ్రువులు

రాలుస్తారు.

కృష్ణ తల్లి మృత్యువార్త విని మృత్యువాత పడుతుంది.

ఆ విజ్ఞాన శాస్త్ర పరిశోధకుడు వసుమతిని మనసు మందమయిన క్రింది సొరుగులో ఓ చిత్రంలా దాచుకుంటాడు.

ఆర్టు గేలరీలో తన చిత్రాల ముందు కూచొని 'జీవితం' చూసుకుంటూ లీనమయే వారిని 'తాత్విక సంగీతం'ని అర్థం చేసుకునేవారిని చూసి, గడచిన జీవితాన్ని కలగా భావించి జాలిపడుతుంది, కళా గౌరవాల కోసం అంకితమైన కృష్ణ ఆత్మ.

కృష్ణ కళ్లు తెరిచాడు. నిద్రో కాదో. ప్రకృతి రమ్యాతిరమ్యంగా ఉంది. అక్కడ రైలు ఆగితే ఆ పర్వతారణ్యాల మధ్య దిగిపోయి అక్కడే కొన్నాళ్లు బతకాలనిపిస్తున్నది.

రైలు ఆగలేదు.

* * *

*ఆంధ్రప్రభ వారపత్రిక*

*1960*